క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బేతాళ ప్రభాకర్



తెనాలి రూరల్ : తెనాలి బార్ అసోసియేషన్ ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా అన్నం పిన్నారావు, కార్యదర్శిగా హరిదాసు గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శిగా ఎ. కిషోర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు శనివారం అభినందించి సత్కరించారు.

ఈదర వంశస్థుల ఆత్మీయ సమ్మేళనం



తెనాలి అర్బన్ : ఈదర వంశస్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఐతానగర్‌లో శనివారం నిర్వహించారు. ఒంగోలు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ ఈదర హరిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని వంశవృక్షానికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. అనంతరం హరిబాబు, రచయిత ప్రభాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఈదర శ్యామ్, ఈదర వెంకటపూర్ణచంద్, ఈదర అంకినీడు, ప్రభాకరరావు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, బుచ్చయ్య, పిచ్చయ్య, వేణు, రాంబాబు, రత్నాకర్ పాల్గొన్నారు.

కొలుపుల మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి : పట్టణంలోని గాంధీనగర్ లెనిన్ రోడ్డు నరేంద్రదేవ్ కాలనీలో ఉన్న శ్రీ మహాలక్ష్మి, శ్రీపోలేరమ్మ, శ్రీగంగానమ్మ అమ్మవార్ల దేవస్థానంలో కొలుపుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దేవాలయాన్ని సందర్శించి కొలుపుల మహోత్సవంలో పాల్గొన్నారు. అమ్మవార్లకు పూలమాలలు వేసి హారతి ఇచ్చి తీర్థప్రసాదాలను స్వీకరించారు. రెడ్డి రమణమ్మ, స్థానికులు స్వాగతం పలికారు.

రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

ఇద్దరికి గాయాలు

తెనాలి రూరల్ : ఓ స్థలం విషయమై రెండు సామాజిక వర్గాలు ఘర్షణ పడగా, ఇద్దరు గాయాలపాలయ్యారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో స్థల వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ స్థలంలో కంచె వేసేందుకు ఓ వర్గం శుక్రవారం ప్రయత్నించగా మరో వర్గం అడ్డుకుంది. ఈ నేపథ్యంలో జరిగిన దాడిలో ఇద్దరు ముస్లిం వ్యక్తులు గాయాల పాలయ్యారు. వీరు వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని మౌర్యబార్ రెస్టారెంట్ వద్ద చోటు చేసుకుంది. గత మూడు రోజులుగా మద్యం సేవిస్తూ హిందీలో మాట్లాడుతున్న వ్యక్తి ఆ ప్రాంతంలో కనిపించారు. శుక్రవారం సాయంత్రం అపస్మారక స్థితిలోకి చేరుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వీఆర్వో షేక్ రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ కె వీరాస్వామి తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

క్రీస్తు నామంతో ప్రశాంత జీవనం



గుంటూరు రూరల్: క్రీస్తుని నామంలో విజయం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. గత మూడు రోజులుగా నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సువార్త ఉజ్జీవ మహాసభలు శనివారం కొనసాగాయి. ఉదయం ప్రత్యేక ప్రార్థనల్లో ముందుగా కృపా మినిస్ట్రీస్ బ్రాంచ్‌లకు చెందిన పాస్టర్లు క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ స్తుతి గీతాలు ఆలపించారు. బ్రదర్ మాథ్యూస్ క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందిస్తూ ఏసు క్రీస్తు లోకంలోని పాపుల పాపాలను కడిగేందుకు జన్మించాడన్నారు. ఆయన రక్తంతో పాపుల పాపాలను కడగల పవిత్రమై దేవుడు క్రీస్తని తెలిపారు. క్రీస్తుని నమ్మి ఆయన సన్మార్గంలో నడిస్తే ఎటువంటి ఆటంకాలు లేకుండా జీవితం ప్రశాంతంగా సాగుతుందన్నారు. పాస్టర్ బోగి శాంతారావు, వినయ్ మాథ్యూస్‌లు క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో 18వ వార్షిక ప్రత్యేక ప్రార్థనల నూతన స్తుతిగీతాలు ఆలపించారు. ఉదయం, సాయంత్రం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో లక్షలాదిగా క్రీస్తుని భక్తులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రత్యేక ప్రార్థనలు ముగుస్తాయని మినిస్ట్రీస్ ప్రతినిధులు తెలిపారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్



మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక



ఇంటింటి ప్రచారం చేస్తున్న సత్యనారాయణ, పార్టీ నేతలు

ఎమ్మెల్యే సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: సంక్షేమ రథసారథి సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని 35వ వార్డులోని గంగానమ్మపేట కొత్తమాసు తులసీ దాసు జ్యూయలరీ నుంచి శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, వీర్లపాటి విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, 35వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు చెరుకూరి సురేష్, తాడిబోయిన నాగార్జున, తాడిబోయిన పోలురాజు, పోతిరెడ్డి హేమలత, కఠారి హరిష్, చుండూరి వెంకటేశ్వరరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, నీలి అజయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అందరి మంచి కోరే జగన్‌ను ఆదరించండి

తెనాలి రూరల్: కులమతాలు, పార్టీలకతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ అందరి మంచి కోరే జగనన్నను ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ అన్నారు. రూరల్ మండల గ్రామం నందివెలుగులో శనివారం ఆయన పార్టీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారికి గత ఐదేళ్లలో అందించిన పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రజలతో మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో గత 58 నెలల్లో 99 శాతం అమలు చేసి రాజకీయాలంటే ప్రజలకు విశ్వసనీయత నెలకొల్పారన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తోటకూర వసంతరావు, తోటకూర సుబ్రహ్మణ్యం, బొంతు నరేంద్రరెడ్డి, శాంతిరాజు, వేముల మహేష్, షేక్ అబ్బు, షేక్ చినగాలీషా, షేక్ హుస్సేన్, షేక్ రబ్బాని, కమాదుల స్వామి, బాలగురవమ్మ, పినపాటి అనిల్, కార్తికేయ, కసుకుర్తి దానియేలు, బ్లెం బాజి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలి

రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ రమణ



ర్యాలీలో పాల్గొన్న రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ రమణ, కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్ : ఓటు ఆవశ్యకతను అందరూ తెలుసుకుని వచ్చే ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెనాలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ రమణ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో శనివారం ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులోకి వెళ్ళి ప్రయాణీకులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మే 13న జరిగే ఎన్నికల్లో అందరూ ఓట్లు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్, సచివాలయ, రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనపర్తి ఏసురత్నం ఉద్యమజీవితంపై పుస్తకావిష్కరణ

తెనాలి : అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటిహాలులో ఆదివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సభను నిర్వహించనున్నారు. అంబేడ్కర్ సేవా ట్రస్ట్, జైభీమ్ ఫెడరేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సభలో ప్రముఖ అంబేడ్కర్‌వాది, నిబద్ధత కలిగిన దళిత ఉద్యమ రథసారథి కనపర్తి ఏసురత్నం ఉద్యమ జీవితంపై రూపొందించిన పుస్తక పరిచయం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సేవా ట్రస్ట్ కార్యాలయంలో శనివారం సాయంత్రం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఏసురత్నంపై పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి సంకలనంలో తీసుకువచ్చారని, ఆమె దీనిని ఆవిష్కరిస్తారని డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ వెల్లడించారు. అదే సభలో ప్రముఖ దళిత నేతలు ప్రసంగిస్తారని వివరించారు. కరపత్రం ఆవిష్కరణలో డాక్టర్ అబ్రహాం లింకన్, పిల్లి విద్యాసాగర్, దుభా సందీప్, పాముల దాస్, కనపర్తి మోహన్‌రావు, మోపర్తి సుధాకర్, యంగ్రపాటి అశోక్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పదవి నుంచి క్రిస్టినా తప్పుకోవాలి

మున్నంగి వైఎస్సార్ సీపీ నేతల డిమాండ్

మున్నంగి (కొల్లిపర) : వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి తన భర్త సురేష్‌కుమార్ సహా రాజీనామా చేసిన ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తన జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి కూడా రాజీనామా చేయాలని మున్నంగికి చెందిన పార్టీ నేతలు డిమాండ్ చేశారు. గ్రామ పార్టీ కార్యాలయంలో శనివారం మున్నంగి గ్రామ సర్పంచ్ వేమూరి దీనమ్మ, ఉపసర్పంచ్ ఆళ్ళ శివనాగిరెడ్డి, పార్టీ నాయకులు బొంతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2021లో జరిగిన పంచాయతీరాజ్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొల్లిపర మండలం జెడ్పీటీసీ స్థానం నుండి పోటీచేసి కత్తెర హెనీ క్రిస్టినాను తామంతా గెలిపించుకున్నట్టు గుర్తుచేశారు. భారీ మెజారిటీతో విజయం సాధించిన హెనీ క్రిస్టినాను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారని తెలియజేశారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరిన హెనీక్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మేడికొండూరు: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని మందపాడు ఎస్సీ కాలనీకి చెందిన కఠారు మరియదాసు(42) పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడు సంవత్సరాలుగా సాగు చేస్తున్న మిర్చి పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, పెట్టుబడి పెరిగి, ఆదాయం తగ్గడంతో అప్పుల పాలయ్యాడు. తన జీవనోపాధి వ్యవసాయం కావడంతో లాభాలు వస్తాయని ఆశయతో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. ముందస్తుగా కౌలు కొంత మొత్తం చెల్లించాడు. సాగు వర్షాభావం పరిస్థితుల్లో పంట దిగుబడి ఆశించినదాని కంటే తగ్గింది. పంట సాగుకు తెచ్చిన అప్పు, మరోపక్క పురుగు మందుకు తెచ్చిన అప్పులు మొత్తం రూ.5 లక్షలు అప్పులు తేలింది. అప్పుల భారం భరించలేక గ్రామంలో మిర్చి కల్లంలో క్రిమిసంహారక మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టు అంబటి శ్యామ్‌సాగర్‌కు అవార్డు ప్రదానం

తెనాలి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ అంబేడ్కర్ రీడింగ్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం టాలెంట్ ఎక్స్‌ప్రెస్, టీవీ 7 ఇండియా న్యూస్ నిర్వాహకుల ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డును స్థానిక జర్నలిస్టు అంబటి శ్యామ్‌సాగర్‌కు ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంబేడ్కర్ చైర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంగ్రపాటి అశోక్‌కుమార్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఎస్.గురుబ్రహ్మం, కనపర్తి రత్నాకర్, కనపర్తి డేవిడ్, బాబూరావు, పుట్ల పున్నయ్య, శేఖర్, ఉన్నం భూషణం, మేకల సుబ్బారావు, గుమ్మడి ప్రకాష్‌రావు, ఎన్‌జే శామ్యూల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాబు బహిరంగ సభకు రోడ్డు ధ్వంసం



జేసీబీ సాయంతో రోడ్డుకు రంధ్రాలు వేస్తున్న టీడీపీ నాయకులు



రోడ్డును పగలగొట్టి వేసిన రంధ్రాలలో కట్టిన ఫ్లెక్సీలు

తాడికొండ: చంద్రబాబు ప్రజాగళం బహిరంగ సభకు బ్యానర్ల ఏర్పాటు పేరుతో టీడీపీ నాయకులు ప్రధాన రహదారిపై సిమెంట్ రోడ్డును శనివారం ధ్వంసం చేశారు. బ్యానర్ల ఏర్పాటు పేరుతో సీసీ రోడ్డును పొక్లెయిన్ సాయంతో రంధ్రాలు వేసి మరీ కర్రలు పాతి బ్యానర్లు కట్టారు. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, మరో వైపు టీడీపీ నాయకులు యంత్రాల సాయంతో రోడ్లు ధ్వంసం చేస్తున్నా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోలేదు.

ప్రారంభమైన హ్యాక్‌ఫెస్ట్ రీజినల్ పోటీలు

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఫెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో 'హ్యాక్‌ఫెస్ట్ 2024' రీజినల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు రియల్ వరల్డ్ సమస్యలకు ఇన్నోవేటివ్ ఐడియాలను గుర్తించి వాటిని ప్రదర్శించటానికి ఇలాంటి జాతీయ స్థాయి ఫెస్ట్‌లను శాప్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. ఎల్ వెంకటరామన్ మాట్లాడుతూ సాంకేతిక విద్యా మండలి ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను అధిగమించటానికి సాంకేతికత మరింత అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన విధంగా తమ కళాశాలలో విద్యాబోధన, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే సౌకర్యాలను కల్పించటం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 కళాశాలలకు చెందిన 75 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ బాలాజీ, డాక్టర్ కె రామారావు, డాక్టర్ వై రాకేష్‌కుమార్ విద్యార్థులు తదితరులున్నారు.

అభిమానం ఉరకలెత్తే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దిష్టితీసేందుకు గుమ్మడి కాయలతో వచ్చిన మహిళలు

- సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు పోటెత్తిన జనం
- ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, అభ్యర్థి లావణ్య తదితరులు

మంగళగిరి: నగరం జనసంద్రంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శనివారం మంగళగిరి వస్తుండడంతో ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. రోడ్డు పొడవునా బారులు తీరారు. కాజ టోల్‌గేట్ వద్ద మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి ప్రారంభమైన యాత్ర సీకే కన్వెన్షన్‌కు చేరింది. టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరావు, పట్టణ రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తాడేపల్లి పట్టణ రూరల్ అధ్యక్షులు బుర్రముక్క వేణుగోపాలరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఎండీ ఫిరోజ్, దుర్గగుడి సలహాదారు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(జేపీ), అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పాటిబండ్ల కృష్ణమూర్తి, కళ్లం రాజశేఖరరెడ్డి, దొంతిరెడ్డి బాలాజీ రెడ్డి, చావలి మురళీకృష్ణ, బొమ్మారెడ్డి సునీత, పాలేటి కృష్ణవేణి, బొమ్మారెడ్డి అజర్‌రెడ్డి, జిక్కిరెడ్డి కృష్ణారెడ్డి, మిరియాల రాంబాబు, అమరా నాగయ్య, మధు, బిరుదుగడ్డ విజయేంద్రరావు, కూరపాటి సాంబిరెడ్డి, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, ఎంపీపీ సంతోష స్వరూపవాణి, దాసరి వీరయ్య, డీవీఆర్, కృష్ణకిషోర్, ఎస్.రత్నం, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, కొల్లి శేషిరెడ్డి, గూండా మధు పాల్గొన్నారు.



కాజ టోల్‌గేట్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్న నాయకులు

అడుగడుగునా నీరాజనం..

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శనివారం మంగళగిరి నియోజకవర్గంలోని ప్రవేశించడంతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు ప్రజలు భారీఎత్తున జాతీయ రహదారిపై పొడవునా బారులు తీరారు. అభిమానులు పూలవర్షం కురిపించారు. తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని పాత టోల్‌గేట్ వద్ద బస్సులో విశ్రాంతి తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయంత్రం 4.30కు బస్సుయాత్రను ప్రారంభించారు. ఓల్డ్ టోల్ గేటు వద్ద మహిళలు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి దిష్టి తీసేందుకు వందల సంఖ్యలో గుమ్మడికాయలు పట్టుకుని నిలబడ్డారు. ముఖ్యమంత్రి రాగానే బస్సుకు గుమ్మడి కాయ దిష్టితీసి జై జగన్ అంటూ బస్సు వెంట పరుగులు తీశారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకను పురస్కరించుకుని 25 అడుగుల పూలదండను క్రేన్‌కు ఏర్పాటు చేసి బస్సుయాత్రకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రారంభించే సమయానికి జోరున వర్షం పడుతున్నా వర్షాన్ని లెక్కచేయకుండా తమ అభిమాన నాయకుడి కోసం డాన్సులు చేస్తూ కేరింతలు కొట్టారు. సిద్ధం పేరుతో బ్యానర్లు ఏర్పాటు చేసి బెలూన్లు ఎగురవేశారు. ఓల్డ్ గోల్‌గేటు వద్ద నుంచి కనకదుర్గ వారధి వద్దకు 700 మీటర్లు ఉండగా వారధికి చేరుకునే సరికి రెండు గంటల సమయం పట్టింది. బస్సుయాత్ర కనకదుర్గ వారధి వద్దకు వెళ్ళగానే పోలీసులు బస్సుయాత్ర వెంబడి వెళుతున్న ద్విచక్రవాహనాలను నిలిపివేయడంతో వాహనాలను పక్కన నిలిపి బస్సువెంట పరుగులు తీశారు. కనకదుర్గ వారధిపై బస్సు ముందు, వెనుక భారీగా ప్రజలు ఉండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 30వ ఖానా వద్ద బస్సును ఆపించి బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, జేసీఎస్ గుంటూరు జిల్లా కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, తాడేపల్లి టౌన్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, కళ్లం రాజా, మిరియాల రాంబాబు, మేకల సాంబశివరావు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, ప్రకాష్, అనిల్, దాసు, ఎలీషా పాల్గొన్నారు.

మద్దతు పలికిన సినీనటుడు మహేష్‌బాబు అభిమానులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర తాడేపల్లికి రావడంతో తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని సినీనటుడు మహేష్‌బాబు అభిమానులు మహేష్‌బాబు చిత్రపటాలతో, వైఎస్సార్ సీపీ జెండాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించి సందడి చేశారు.

పేద మహిళకు అంత్యక్రియలు

తెనాలి అర్బన్ : అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన పేద మహిళకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలోకి వెళితే గాంధీచౌక్ సమీపంలో ఒక తల్లి, ఇద్దరు కుమార్తెలు వంట చేసుకుంటూ జీవిస్తున్నారు. వారిలో కుమార్తె జ్యోతి (40)అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. దహనసంస్కరాలు చేసే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆమె తల్లి శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనును సంప్రదించి అంత్యక్రియలను నిర్వహించాలని కోరారు. దీంతో సభ్యులు సంప్రదాయ పద్ధతిలో చినారావూరులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు షేక్ మౌలాలి, అక్కల రమేష్, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేనివారిపాలెం సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సీఐ జయకుమార్ తెలిపిన వివరాలు.. సిరిపురం గ్రామానికి చెందిన హరికృష్ణ ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళుతున్నాడు. మార్గమధ్యంలో భీమినేనివారిపాలెం సమీపంలో ఉన్న కోల్డ్‌స్టోరేజ్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో హరికృష్ణ ఘటనా స్థలంలో మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.